
**సాహిత్య శీర్షిక**

ఫట్మన్న శబ్దం.... భళ్ళున గాజు పెంకులు రాలిన చప్పుడు. అంతవరకు అక్కడ ప్రవహించిన రంగుల వెల్లువ ఇంకిపోయింది. ఆడుతూ పాడుతున్న బుల్లితెరమీద బొమ్మలు స్రవించే చిక్కని చీకటిరక్తంలో మునిగి అదృశ్యమైపోయేరు.

ఉత్సాహంతో చూస్తున్న ప్రేక్షకులు పగిలిన పెట్టెనుండి ప్రవాహంలా ఉరికిన చీకటి వరదలో మునిగి తేలుతూ అరుస్తున్నారు. జరిగిందేమిటో తెలియక. అదే అదను గా పోకిరి కుర్రాళ్ళు అమ్మాయిల జాగాల్లోకి చొచ్చుకుపోతున్నారు. 'చీకటి

# రంగు రంగుల చీకట్లోకి



**గంటేడ గౌరునాయుడు**

కొండచెరియ' విరిగి మీదపడ్డట్టు అరుపులు..కేకలు.

ఆ కేకల్ని చీల్చుకుంటూ ఓ ఆడగొంతు.

"అలగ సవ్వండా....నేకపోతే గుడ్డలూడదీసుకోని నడీదిగుమ్మాన గెంతుతారు. ఆడపుట్టుగు పుట్టినావే...సిగ్గునేదా.... మొల మీద జానడు గుడ్డపీలిక తప్ప మరి కట్టుకోడానికి లేనట్టగ....ఆ యేసమేటి.."

అంత గోలలోనూ ఆమాటలు స్పష్టంగా వినిపించేయి.

"ఒరే. పిచ్చి శాంతమ్మరా...యిది దాని పనే...పట్టుకోండ్రా" ఎవరో అరిచేరు. కొందరు వెనక పరుగు పెట్టేరు.

"మంచిపాటలోన ఆగిపోయిందోస్." ఒకడి విసుగు.

"గొప్పడేన్సు సుమా...నాలుగు సార్లు సూసినాను యీపాటకే ఓకుర్రాడు హీరోయిన్ అందాల్ని మననం చేసు కుంటూ

ఆ చీకట్లో ఎవరో కుర్రాడు అమ్మయిల్లో ఒకరిమీద చేయివేసేడు. అక్కడో తగువు. అది పెరిగి పెద్దదై కుటుంబాల మధ్య తగవుగా మారి కర్రలు తీసుకునే పరిస్థితికి దారితీసింది.

"నాటీ.వీ సంగతేటసలు.. అదితేల్చండి ముందు." టీ.వీ. ఓనర్ గోల.

వీధి వీధంతా అల్లరల్లరిగా వుంది.

ఊరు ఊరంతా చిమ్మచీకటిగా ఉంది.

శాంతమ్మ చీకట్లో పరుగులు తీస్తూ వెనక వచ్చిన వారిని తప్పించుకుని ఊరి చివరనున్నపాడుపడ్డపెంకుటింట్లోదూరింది. తన ఒడిలో మూటగట్టిన వాటిని నేలమీద ఒలకబోసింది. అగ్గిపెట్టె వెతికి తెచ్చి, ...ఓ కాగితానికి నిప్పంటించింది. ఆ వెలుగులో తను నేలమీద ఒలక బోసిన వాటివేపు చూసింది. ఎక్కడెక్కడో ఏరి, పత్రికల్లోంచి చించి తెచ్చినకాగితం ముక్కలవి. ఆ కాగితాల మీద బొమ్మలు న్నాయి. అవి కొన్ని రంగుల్లో వున్నాయి. ఆడ, మగ, బొమ్మలు, ఒంటీమీద గడ్డల్లేని బొమ్మలు. ఆ బొమ్మల కాగితాలన్నిట్ని కసిగా చించి వాటికి నిప్పెట్టింది. ఆ వెలుగులో ఆమె ముఖం దివ్యంగా వెలిగిపోతోంది. అప్పుడామెను చూస్తే 'పిచ్చిది' అనుకోరెవరూ ఆమె ఏదో గొణుక్కుంటూ ఇంట్లోకెళ్ళి దేవుడి బల్ల మీద దాచిన ఓ పాస్ పోర్టు సైజు ఫోటో ఒకటి వెతికి తెచ్చి.. మంట వెలుగులో తదేకంగా చూసింది. ఆమె కళ్ళలోంచి నీరు వుబికి వచ్చింది.

'ఏమై పోనావే నా కూతురా....
నువ్వే పర్రాకులు పడతున్నావే
నాకుతురా......

ఏడుపు రాగాలతో గతంలోకి జారి పోయింది. ఆమెకు తన స్థితేమిటో తెలు స్తోంది... తెలిసి...మతి స్థిమితం ఉన్నంత సేపు ఏడుస్తోంది... ఏడుస్తూ గతాన్ని కెలుకుతోంది.

"..... ..... ..... ....... ...... ......... ....
సిన్నన్న యిచ్చాడు సిలకపచ్చాకోక
కోకైతె సిరిగింది రారుకన్నోరు
నడి పన్నయిచ్చాడు పాదాలపట్టీలు
పట్టీలు అరిగాయి రారుకన్నోరు
పెద్దన్న యిచ్చాడు పెద్దావుపడ్డ
పడ్డలు తెపెరిగింది రారుకన్నోరు..
..... ..... ..... .... ..... ..... .... ..."

వెన్నెల గంధం పూసుకున్న పిల్లగాలి శాంతమ్మ పాడుతున్న పాటను అలల రెక్కలపై మోసుకుపోతూ వీధిలో తేలియాడుతోంది. ఇంటి అరుగులమీద, గడపలోను కూర్చున్న ఆడ మగ పాటలో లీనమై చుట్టలు అడ్డపొగవేసి అడ్డాలు జాపు కూనీ,,కొందరు.... కునికి పాట్లు పడుతూ కొందరు శాంతమ్మ గాత్ర మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు.



ప్రవాహంలా సాగిపోతున్న పాటను ఆపిందిశాంతమ్మ.ఓసారి,ఎదురుగాకూర్చున్న వారివేపు చూసి అంది.

"వదినా....అపుడుమేటి యివేల్టకి..."

"అదేట్నేత్తు...కసింత పాడీరాదా. ఏటి... ఏలమించి పోయిందా?"

"రోజూ యింతేసి పాడుకుంతన్నాం గాదా. పెందిల పన్లకెల్లొద్దాం. అందలోన మీ తమ్ముడు అసలే కోపిష్టోడు...."వెనక పాట పాడుతున్నావిద అంది. ఆపడమే మంచిదన్నట్టు. అందరూ లేచేరు.

శాంతమ్మ ఇంట్లోకి చూసింది. కూతురు పద్మ యింకా చదువుతోంది. కూతుర్ని పిలిచింది.

"ఔనే పద్మా...యింకా సదువుతన్నావా'

"ఆ... ఆ... సరిసరి.." చదువుతున్న పుస్తకంలో మరో పేజీ తిరగేసింది పద్మ.

"ఔనమ్మీ....ఏటే అంత దీచ్చగ సదివెత్తన్నావు. ఊరిజనమంత మన గడపలకూకోని పాట ఆలకించుతుంతే నువ్వేంది ఇనవూ...?"

"అమ్మా... ఆపాటలు.... అవీ. మీ ముసిలోలకే..." పక్కమీద వాలుతూ దీపం దగ్గర పెట్టుకుని మళ్ళీ పుస్తకంలో తల దూర్చింది.

"మీకీ పాటలు ఎందుకునచ్చుతాయి. ఆసినిమా పాటలైతే నచ్చుతాయి కాని... అయినా అవేం పాటలే....ఛ...ఛ... ఏం పాటలో ఏం సినిమాలో... ఏ కీలుగుర్రమో ఏ లవకుశో.... సూత్తే పున్నేనికి పున్నెము ...



సరదాకి సరదా సూత్తే అలసింటివి సూడాల. ఇప్పుడా ఆ అన్నీ సినిమాలే."

"అమ్మా.. మాకు నచ్చిన సినిమాలు మీకు నచ్చవు.... మీకు నచ్చిన సినిమాలు మాకు నచ్చవు...గానీ నువ్వు పడుకో..." అని పుస్తకంలో ముఖం దూర్చింది పద్మ.

"ఏటే.... యీవేల తొంగోవేటి నువ్వు... కళ్ళు తీసి కళ్ళు పడెత్తన్నావు పుస్తకంమీద.. అంద లేటుందే...."

"అన్నయ్య రాసిన కథ"

"ఆ...అయితే సెప్పవేంది. నెమ్మి స్థదివిమీ....ఆ కతేటో" ఆత్రంగా అడిగింది శాంతమ్మ.

"అమ్మా.... నీకీ కథ అర్థం కాదే.."

"అర్థం కాపోడమేటే...కత అర్థం కాపోడానికి నానంత తెలివి తక్కువ దాన్లాగ కనబడతన్నానేటి?"

"అది కాదమ్మా....యిలాంటి కథలు నీకు బాగుండవు... అంతే.."

"బాగోపోడమే టిసెప్పీ....." అంటూ కూతురు చదువుతున్న పుస్తకంలోకి చూసింది. ఆ పేజీలో ఓ అమ్మాయి ఓ అబ్బాయి, బొమ్మ..... రంగుల్లో ఆ బొమ్మను చూస్తుంటే తొలిరాత్రి గదిలోకి తొంగి చూసినట్టుంది."

శాంతమ్మ కూతురి వేపుచూసింది పరిశీలనగా బంతిపూలు రాశిపోసినట్టుంది. ముసిముసి నవ్వుల మల్లెలు మాలలో ఒదిగిపోయినట్టుంది. నాగావళి నది నడి చొచ్చి చాపమీద చేరబడినట్టుంది.

'పిల్లకి ఈడొచ్చింది' అనుకుంది.

"అమ్మీ" అని పిలిచింది. పద్మ బదులు పలకలేదు. పుస్తకంలో మునిగి పోయింది. శాంతమ్మ మరిపిలవలేదు. ఏదో ఆలో చిస్తూ నిద్రలోకి జారిపోయింది.

"అవున్రా బావు... వతన కాసేనా రావడం?"...శాంతమ్మ

"అన్నయ్యా కాళ్ళు కుడుక్కో" నీళ్ళిచ్చింది. పద్మఅన్నయ్య చేతిలోని పత్రిక లాక్కుంటూ. ఆత్రంగా పేజీలు తిరగ వేస్తున్న పద్మ చేతిలోని పత్రిక లాక్కుని మధ్య పేజీలు ఫట్ న లాగి మడత పెట్టి జేబులో పెట్టుకుని పత్రిక చెల్లెలికి యిచ్చేసేడు.పద్మ పత్రిక తీసుకుని పేజీల్ని అటుయిటు తిప్పి ప్రక్కన పడేసింది. అది గమనించిన పద్మ అన్నయ్య అడిగేడు "ఏమే పక్కన పడేసేవు"

"తరవాత చదూతాన్లే" అని వీధి అరుగు మీదికి చేరుకుంది. కానీ ఆమె దృష్టి అన్నయ్య దాచేసిన మధ్య పేజీమీదనే వుంది.


"అమ్మా నాకథకి మొదటి బహుమతి వచ్చింది. పట్నంలో నాకు అభినందనసభ కూడా ఏర్పాటు చేసేరు. ఆ రోజు నువ్వు రావాలమ్మా... చెల్లిని తీసుకుని."

శాంతమ్మ మనసు ఉప్పొంగి పోయింది.

"ఔనే నీసదువు మండిపోను సదువు.. అవతల బియ్యం ఎసరు పొంగిపోయి పొయ్యంతా నానిపోతే సూడక్కర్నేదా. అ ఢ్ఢిద్దు బియ్యం కూడు నున్నగ సింవిడి పోయింది...."

తిడుతున్న తల్లి ముఖంలోకి భయం భయంగా చూస్తూ చెప్పింది పద్మ.

"అన్నయ్యరాసిన కథకి బహుమతి యిచ్చారే....ఆకథవచ్చిందమ్మా....అన్నయ్య ఫొటో ...నీ పేరూ నాన్నపేరు...వేసేరమ్మా ఇందు లో...కథ ఎంత బాగుందో."పద్మ మాటలు విన్న శాంతమ్మకి కోపం




"ఒరే బావు...అలాగే కానీ... కోడల్ని పిల్లల్ని సూసి సేన్నాలయ్యింది. ఆ వేల తీసికిరమ్మీ.." అని....అనుకుంది మనసు లో 'నీ పెల్లంయిక్కడికి ఎలా గూరాదు...'

'తన కడుపున పుట్టిన వాడు ఎంత గొప్పొడయ్యాడు' అని సంబరపడి పోయింది శాంతమ్మ.

"రాజా పత్రిక వచ్చిందా" పద్మ ఆత్రంగా అడిగిందిపక్కింటి రాజుని. రాజు ఇంటర్ తప్పి ఇంట్లో కూర్చున్నాడు. వారపత్రికలు, నవలలు తెగచదువుతాడు. తాను చదివి పద్మకి యిస్తుంటాడు. రాజు ప్రతివారం తెచ్చే పత్రికల కోసం ఆత్రంగా ఎదురు చూస్తుంటుంది పద్మ.

'ఇదిగో' పత్రిక తెచ్చి పద్మచేతిలో పెట్టేడు రాజు. ఇచ్చిందే తడవుగా ....తలగడ ఎదకు ఆనించుకుని పత్రిక చదవడంలో మునిగిపోయింది.

"అమ్మీ"

చెదిరిన ఓణీని సరిచేసుకోవాలని కూడా తలంపు లేకుండా చదువుతున్న కూతు రును అదోలాచూసి వంటింట్లోకి వెళ్ళింది శాంతమ్మ. పొయ్యిమీద ఉడుకుతున్న అన్నంపొంగి పొయ్యి ఆరిపోయి ఉంది.

ఎగిరిపోయింది. పత్రికలో కొడుకు ఫొటో చూసీ, కొడుకు గురించి రాసిన మాటలు చదివించుకునీ మురిసి పోయింది.

"కథ సదివి ఇమ్మీ...."

"అమ్మా...అది చదివి వినిపించడానికి పనికిరాదే...ఎవరికి వారే చదువుకోవాలి' యిబ్బందిగా అంది పద్మ.

"ఇదేటోలమ్మ....యిద్దూరం గుడ్డెట్టి పినట్టుసెప్తావు" మీ నాన్న ఏపుస్తకమయినా సదివి వినిపించీవోడు. భారతం సదివి అర్థం సెప్తే జనం అలాగ పావుల్లాగ తలలూపుకొని ఆలకించీవోలు కతల పుస్తకం తెచ్చిసదివి నాకు వినమనీవోడు. అందల మనబతుకులు. మన బాధలు.... కట్టసుకాలు ...అన్నీ కలబోసుకున్నట్టుం దేవి. మరి నువ్వేటే.... కతలు సదవడానికి పనికిరావంతావు..."

"అదంతేనమ్మా...నీకు తెలీదు..చెప్తే వినిపించుకోవూ..." అని తల్లి దగ్గరగా వచ్చి మాట మార్చి అంది.

"అమ్మా....అవతల వీధిలో వీడియో సినిమా వేస్తన్నారే వెళ్లానమ్మా..."

"ఏం సినిమా.... బత్తిరన వేంనా ....నానూ వత్తాను..."

"అదీ.....అదీ......"

"సినిమా పేను సెప్పమ్మంతే అదీ....దీ అని నానుస్తావేటే సదువుకున్నదానివి. పేరు తెలీదా..."

"పేరు తెలీక కాదు" అంటూ చెప్పింది. యిబ్బందైన పేరు.

"ఛ అదేం పేరు...ఆలకించడానికే అసేయంగుందీ"

అదంతే...నానెల్తాను మరి..."

" ఎల్లు...వద్దంతే మానేత్తావేటి ... యింకా కాదంతే ఏడుసుకోని తొంగుంతావు... "అమ్మ అంగీకారం అయ్యిందే తడవు పద్మ నాలుగు మెతుకులు కొరికి తిన్నాననిపించి రివ్వున వీధిలోకి పరుగు తీసింది.

"ఏం సినిమాలో ఏం పిల్లలో... వినాయకసవితి వచ్చినా....గౌరీ పున్నమి వచ్చినా...కార్తీక ఏకాదశి వచ్చినా... జాలారి బాగోతమే... గంగా వివాహమో హరిశ్చంద్ర నాటకమో బాలనాగమ్మ బుర్రకతో ...పాడించీవోలు. ఈధిలో పందిరేత్తే ఒకటే సందడి... పిల్లల్నుంచి ముసిలోలందరికీ అదొక సంబరం... యివేవీనేపోతే..... జముకులు పాట పాడించుకుంతే తెల్లగ తెల్లారిపోయీది... ఇప్పుడవేవి... యీడియో సినిమాలట నేపోతే రికార్డుంగు డేన్సులు, మిగతా సినీమాకి ఎల్తే మొదుల్నుంచి కొసదాక గుడ్డలిప్పుకొని గెంతడాలు. అది పాటో.. దెబ్బలాటో యేటో తెలీదు... యింత పిసరు కతేటో తెలీదు. పైటుంగులట సైటింగులు... రత్తా పోరు.... సినిమానిండా.....'

"ఏటే నీలోన నువ్వే మాట్లాడుకుంతన్నావూ...."కిటికీ గోడమీద నున్న కిరసనాయిలు బుడ్డీతో చుట్ట ముట్టించుకుని అడిగేడు ఎదురింటి రామినాయుడు.

"రారన్నా....రా.." అంటూ నులక మంచం వాల్చింది శాంతమ్మ.

"ఔనూ.... అల్లుడు రాసిన కథేటో పేపర్ల పడ్డాయట ఐదువేలో ఎంతో.... బహుమానమూ వచ్చిందట... అందరను కుంతన్రు.."

"ఆ....ఆ... యిదా...పుస్తకం తెచ్చింది అమ్మి సదవమంతే నీ కేటి తెలీదూ. అనీసింది. అన్నా...నువ్వు సదివిత్తు...యింతాను..." పత్రిక తెచ్చి అతని చేతిలో పెట్టింది. వీధిలో నలుగుర్ని పిలిచింది. కొడుకురాసిన కథ వినడానికి.

"ఈ రోజు పాట వద్దర్రా....'కత' ఆలకించుదుంగానీ శాంత కొడుకు రాసినాడట"

అందరూ కూర్చున్నారువినడానికి. బుడ్డీ దీపం ముందు పెట్టుకుని కళ్ళజోడు సవరించుకుని కథ చదవడానికి ఉపక్రమించేడు రామినాయుడు.

".....బాత్‌రూం నుండి బయటకు వచ్చిన రాణి అతణ్ణి చూసింది విస్మయంగా. కళ్ళింతలు చేసుకుని నిలబడిపోయింది. ఆమె ఒంటిమీద ఉన్న మెత్తని టవల్ జారిపోయింది......"

ఆ తరువాత రామినాయుడి చూపులు మౌనంగా అక్షరాల వరుసలపై నడిచేయి గాని పెదవులు సహకరించలేదు

"ఏందిరాబాబు ఆగిపోయినావు.. అర్థమవ్వనేదేటి"? ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది శాంతమ్మ.

"అర్థమవ్వడాని కేటి గానీ.... సదవడానికే యిబ్బందిగుంది" అదోలామొహం పెట్టేడు రామినాయుడు.

"ఇబ్బందే ట్రాబావు." ఒకావిడ అంది.

"ఏటంతే నానేటి సెప్తాను....అందలో నున్నదంతా అదే" ఎలా చెప్పాలో తెలియ లేదతనికి

"అదే...అంతే....? " ఓముసల్ది ఆశ్చర్యంగా చూసింది.

"తల్లాంటి దానివి... అనగూడదుగానీ... అందలున్న దంతా బూతే...."

"ఏటీ.... యీ పుస్తకంల బూతేటి? బూతుపుస్తకాలు వున్నాయంతారుగానీ....! అవి దొంగతనంగా అమ్ముతారట దొంగతనంగా సదువు సదువుతారట...గదా... మరీ పుస్తకాలు సిన్నసిగురు గుంటల్నుంచి ముసిలాల్దాకా పట్టుకోని తిరుగుతారు" ఆశ్చర్యంగా అందొకావిడ పత్రికల్లో తేడాలు తెల్సినట్టు....

"దొంగతనంగా అమ్మిన పుస్తకాలైతే. ..దొంగతనంగ సదువుతారు. ఏ పూసీ లేదు. ఆట్ని అందరూ సూస్తుండగ కొనలేరు. తేలేరు. తెచ్చినా ఏ ఇరుకు మరుకు జాగాల్లోనో సదువుకోవాల. అదొక దారి. ఇద...ఇలాంటి పుస్తకాల్తోటే బాధ...సిన్నా పెద్ద తేడాలేకుంట.... యిలాటి కధలు సదవబట్టి యీ కతలే సినిమాలు తియ్యబట్టి దేశమిలగుంది... గొప్ప కథ రాసినాడే మనోడు..."

పత్రిక మూసి లేచిపోయేడు రామినాయుడు.


"ఆ ..యిలాంటి కత రాసినందుకేనా... బహుమానమూ యిచ్చినారు?" బుగ్గలు నొక్కుకుని వ్యంగ్యబాణం విసిరిందొకావిడ. శాంతమ్మ ముఖం మసిబారిన దీపం చిమ్నీలా మాడిపోయింది. కొడుకు పేరు పేపర్లొ పడిందని పొంగిపోయిన శాంతమ్మమనసు యీ సంఘటనతో కృంగిపోయింది.

అందరూ లేచివెళ్ళేరు.

దీపం వెలుగులో పత్రిక పేజీలు గాలికి రెపరెప లాడేయి... ఎగరేసిన పైట చెరగుల్లా. శాంతమ్మ విసురుగా లేచింది. పత్రిక అందుకుని ముక్కలు ముక్కలుగా చించి గాల్లోకి విసిరింది.

అప్పుడే అక్కడికి వచ్చిన ఓ ముసలమ్మ అంది

"ఏటే శాంతా.... నువ్వురాలేదేటి సినిమాకి.... మంచి పన్జేసినావు. అదేం



సినిమా సెప్మి... సె సె బట్టి బూతులబుంగ. సిన్న సెర్డీల్తోటి ఆడా మగా ఎగురుతుంతే. యీ వయసిని గుంటల గోల... ఇలపింటి సినిమాలు సూసిన గుంటపాపలు సెడిపో కుంట ఎలాగుం తారు..."

ముసలమ్మ మాటలు విన్న శాంతమ్మకి ఎమనాలో భోధపడలేదు. 'ఇక్కడ కతలోనా అదే. అక్కడ సినిమాలోనా అదే! ఆవిడకేమీ అర్థం కాలేదు... 'యీ కతలుసదివి...యీ సినిమాలు సూసీ దాని బుర్రకి ఎంతెక్కి పోయిందో యిసం' అనుకుంది. తిన్నగా సినిమా వేస్తున్న చోటుకు వెళ్ళింది. అప్ప టికి అక్కడేదో గలాటా జరుగుతోంది. ఎవరో కరెంట్ స్విచ్ ఆపేసేరట... అంతా గందరగోళంగా వుంది.

పద్మ కోసం చూసింది.

పద్మ కనిపించలేదు

'పద్మ అప్పుడే వచ్చీసింది ఇంటికి' పద్మ నేస్తం ఎవరో చెప్పింది. ఇంటికెళ్ళి చూసింది.పద్మ లేదు.

శాంతమ్మకు ఎందుకో భయంవేసింది. వెళ్ళి రామనాయుడితో విషయం చెప్పింది. రామినాయుడు నలుగురు మనుషుల సాయంతో వెతికించేడు. ఆపైన వీది వీధంతా అన్వేషణలో పడింది.


ఊరవతల బడిసాల గేటు ముందు చీకటి కౌగిట్లో చిరుగుల బట్టల్లో.... మూల్గుతూ పడివున్న అమ్మాయిని చూసేరు. శాంతమ్మ భోరున ఏడుస్తూ ఆ ఆ అమ్మాయి మీద వాలిపోయింది. ఎవరో టార్చిలైటు వేసేరు . అమ్మాయి ముఖం మీద...ఆ అమ్మాయి పద్మకాదు. హరిజనవాడ అమ్మాయి.

అందరి కళ్ళు సిగ్గుతోవాలిపోయేయి.

మనుషుల్ని శపిస్తున్నట్టు ఎక్కడో గుడ్లగూబ అరుస్తోంది.

"వయిసిన గుంటలు మద పిచ్చోలై పోతంద్రంతే.... ఆలు సూస్తున్న సినీమా లెటువంటివి? ఆలునదువుతున్న పుస్తకాలు ఎలాంటివి..."

"ఎలాంటి కాలం వచ్చిందిరా నాయినా...ఛ...ఛ"ఓముసలాడు.శాంతమ్మ కీ మాటలు మరింత భయాన్ని పెంచాయి. ఏడుపు ఘోషలనడుమ ఊరు తెల్లారింది. తెల్లవార్లూ శాంతమ్మ వెతుకుతూనే వుంది.




ఆ వెతుకులాట నిద్రాహారాలు లేకుండా మూడు రోజులు సాగింది. మూడో రోజు తెలిసింది... ' పార్వతీపురం రైల్వేస్టేషన్లో పద్మకనిపించిందనీ.... బట్టల వ్యాపారానికి వచ్చిన నెల్లూరు రాజుతో రైలెక్కిందనీ?

ఆ తరువాత యింకెవరో చెప్పేరు. ' నెల్లూరు రాజుకి సినిమావోళ్ళు తెలుసనీ, పద్మకి సినిమాలో వేషం యిప్పిస్తానని చెప్పేడనీ.'

శాంతమ్మ ఎవరితోనూ మాటలాడ కుండా నిర్వికారంగా గడపలో స్థంభానికి చేరబడిపోయింది.

శాంతమ్మ కొడుకు వచ్చేడు..... తనకు జరగబోయే అభినందన... సభకు తల్లిని తీనుకెళ్ళేందుకు. జరిగింది తెల్సి అవాక్కైపోయేడు. శాంతమ్మ కొడుకు వేపుచూసింది అసహ్యంగా అప్పుడు నోరు విప్పింది.

"ఒరే బావ్.... సూసినావురా ఏటి జరిగిందో నీలాంటోలు రాసిన కతలు సదివిసదివీ.... యిలగైపోతన్నార్రా యీ దొచ్చిన గుంటలు! నాయినా... రాసీ... కతలు రాస్సి దేశం మీద ఒదిలీ. ఒరే యీ కతలు పుస్తకాల్లో ఏస్తున్నది. ఎవుర్రా ఆపసినోలు ఎవులోగాని అళ్ళకూతుళ్ళసేత ఆ కతలు సదివించగలర్రా! అల వరకేల...నువ్వునాకు సదివి యిని పించిమీ...సూత్తాను.ఓరే.దాన్ని కాదురా తప్పు మీది. పడగ్గదిలోన గుట్టు పది మందిల బయటు పరిత్తే ఏటౌతాదో ఎరగనోలా మీరు? డబ్బులొత్తాయని పేపరోళ్ళూ పేరు కోసమని మీరు... మీ యిష్టమొచ్చినట్టు రాస్సి అచ్చేసీయండి... కానొరే...నాశనమైపోతార్రా....మాయామరమ్మ తెలీని గుంటల్ని మీ కతల్తోటి.... మీసి నిమాల్తోటి సంపీకండిరా.... సంపీకండి..

"ఒరే....నీ కతలు సదివి నప్పుడు నుంచే ర్రా నీసెల్లెలు దాని పుస్తకాలు చదవడం మానేసింది. దాని పరిక్ష పోగొట్టుకుంది. ఇప్పుడిగల దారి తప్పోయింది. ఏటైపో యిందో నా కూతురు . ఎక్కడ ఏ పర్రాకులు పడతందో..."

భోరున ఏడుస్తోంది శాంతమ్మ. ఏడుపు ఉన్మాదంగా మారి కొడుకును పిడికిళ్ళతో గుద్దింది.... గోళ్ళతో రక్కింది. శాంతమ్మ కొడుకు శిలాప్రతిమలా నిలబడిపోయేడు. అతని చేతిలో అతని బహుమతి పొందిన కథ' అచ్చయిన పత్రిక నలిగిపోతోంది.

గతం గుర్తుకొచ్చిన శాంతమ్మ ఉన్మత్తంగా లేచి నిలిచింది. పెద్దగా అరుచు కుంటూ రామమందిరం మీదికొచ్చింది.

"ఒరే బద్దలు గొట్టండిరా.... మీటీవీలు బద్దలు కొట్టండి. ఒంటిమీద గుడ్డల్లేకుంట సేసిన డేన్సులు రాకుంట మీ టీ.వీలు బద్దలు కొట్టండి. అదా...బూతుకతల బొమ్మల పుస్తకాల్ని తగలబెట్టంద్రా... తగల బెట్టండి. ఒరే..నామాట యినకపోతే ఘోరం జరిగిపోద్దిర్రా మీ పిల్లలు మీకు కాకుండ పోతారొరే. ఒరే లోకంలోన మనుసు లందరు పిచ్చోలైపోతారొరే. నామాట వినంద్రా. మీ సినిమాల్నిమీపుస్తకాల్ని గుంటలు పాలిటి రాచ్చసుల్ని సేస్సి...అల్ని నాశనం సేసీకంద్రా...నాశనం చేసీకండి...'

' వీధివీధి తిరుగుతోంది శాంతమ్మ అరుస్తూ చీకట్లో

అరుస్తూనే వుంది. అరుస్తూ తిరుగు తూనే ఉంది. కనిపించిన అసభ్యకరమైన పోస్టర్లు చించుతూనే ఉంది. పత్రికల్ని ముక్కలు ముక్కలు చేస్తూనే ఉంది. వాటికి కారకులైన వారిని శపిస్తూనే ఉంది... 'వాయిసిన గుంటలు' కనబడితేచాలు భోరున ఏడుస్తూనే ఉంది శాంతమ్మ......